క్లుప్తంగా

దినసరి వేతనం పెంచాలి

● వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్



దేవరుప్పుల : పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ఉపాధిహామీ కూలీలకు పనిదినాలతోపాటు దినసరి వేతనం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చింతబాయి తండా గ్రామంలో ఉపాధి హామీ పనుల ప్రాంతాన్ని పరిశీలించి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి పనులు లేక గ్రామీణ పేదలు పట్టణాలకు వలస వెళ్తుండడంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రెడ్డిరాజుల నారాయణ, మాలు, శంకర్, హర్య తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం'

బచ్చన్నపేట : ప్రజా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి పొట్ల శేఖర్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో క్లెం శైలజ అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని దళితులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దళితులపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష, చిన్న చూపు చూస్తోందని అన్నారు. అనంతరం కేవీపీఎస్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా క్లెం శైలజ, అధ్యక్షుడిగా తుడుం మధు, కార్యదర్శిగా గంధమల్ల మనోహర్, ఉపాధ్యక్షులుగా కొమ్ము శిరీష, బొట్టు కర్ణాకర్, సహాయ కార్యదర్శులుగా పికిలి భాగ్య, శ్రీపతి నరేష్, సభ్యులుగా కర్రె రాములు, తమ్మడి మహేష్, జేరిపోతుల జగన్, మానెపల్లి శ్రీకాంత్, కర్రె ఉదయ్‌ను ఎన్నుకున్నారు.

మరమ్మతు మరిచారు

● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
● స్పందించని పాలకులు, ఉన్నతాధికారులు

రఘునాథపల్లి : మండలంలోని నిడిగొండ ఊర చెరువు తూము, మత్తడి ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోవడం లేదు. తూము నుంచి సాగునీరు వృథాగా పోతుండటంతో కొందరు రైతులు తూము లోపలి భాగంలో ప్లాస్టిక్ కవర్‌తో మట్టి పోసి నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు. మండలంలోని పెద్ద చెరువుల్లో నిడిగొండ ఊర చెరువు ఒకటి. ఈ చెరువు కింద నిడిగొండతో పాటు, శ్రీమన్నారాయణపురానికి చెందిన రెండు గ్రామాల రైతులకు 347 ఎకరాల ఆయకట్టు ఉంది. మూడేళ్లుగా తూము మరమ్మతుకు నోచుకోక సాగునీరు వృథాగా పోవడం, మత్తడికి గండి పడి ఆరేళ్లు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఇటీవల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి తూము, మత్తడి మరమ్మతులతో పాటు చెరువులోకి



మరమ్మతుకు నోచుకొని తూము

గోదావరి జలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విన్నవించారు. ఎమ్మెల్యే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేదు. ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి మత్తడికి, తూముకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. అదే విధంగా చెరువులోకి గోదావరి జలాలు సాఫీగా వచ్చేందుకు ఫీడర్ చానల్ నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు.

అధికారులు స్పందించాలి



ఏళ్లుగా తూము, మత్తడి మరమ్మతుకు నోచుకోవడం లేదు. సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కొందరు తూములో మట్టి నింపి మూసివేశారు. చెరువులో నీళ్లు అలాగే ఉన్నాయి. నీళ్లు ఎక్కువగా ఉంటే మరమ్మతు పనులు చేసే పరిస్థితి లేదు. అలాగే చేపలు పట్టడం కష్టంగా మారడంతో మత్స్య సంపద మృత్యువాత పడుతోంది. మా ముదిరాజ్ కులస్తుల జీవనోపాధి దెబ్బతింటోంది. అధికారులు స్పందించి వెంటనే తూము, మత్తడి మరమ్మతు చేయాలి.

- కోళ్ల సత్యనారాయణ, నిడిగొండ

'సన్న బియ్యం' చరిత్రలో నిలుస్తుంది

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జఫర్‌గఢ్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

జఫర్‌గఢ్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పథకం దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండలంలోని రఘునాథ్‌పల్లి, కూనూర్, కోనాయిచలం, జఫర్‌గఢ్, తీగారం గ్రామాల్లోని రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం సన్నం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ ఒకే రకమైన బియ్యం తినాలనే ఆలోచనలో దేశ చరిత్రలోనే నిలిచిపోయే విధంగా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేపట్టడం జరిగిదన్నారు. తనకున్న ఏకైక ఎజెండా నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు.అనంతరం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

జనగామ రూరల్ : మండలంలోని వడ్లకొండలో శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, మెరుగు బాలరాజు, దండెబోయిన ధర్మేందర్, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సన్నబియ్యం పంపిణీ

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేటలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకిరెడ్డి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

వీధిలైట్లు బిగిస్తుండగా విద్యుత్ షాక్

● జీపీ కార్మికుడికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన జీపీ కార్మికుడు వేల్పుల నాగరాజు

రఘునాథపల్లి : గ్రామంలో వీధిలైట్లు వేస్తున్న పంచాయతీ కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మేకలగట్టులో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వేల్పుల నాగరాజు గ్రామ పంచాయతీ కారోబార్‌గా, మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం గ్రామంలో వీధిలైట్లు వేసేందుకు ఎల్‌సీ తీసుకోకుండా గ్రామంలోని నాలుగు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల డీటీఆర్‌లను ఆఫ్ చేసి నిచ్చెన సాయంతో వీధిలైట్లు బిగిస్తున్నారు. గ్రామ పంచాయతీ సమీపంలోని విద్యుత్ స్తంభానికి నిచ్చెన సాయంతో ఎక్కి లైటు బిగిస్తుండగా పైన ఉన్న 6.3 కేవీ విద్యుత్ తీగను గుర్తించక పోవడంతో తలకు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. స్థానికులు వెంటనే జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌కు తరలించారు. కాగా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంతోనే ప్రమాదం చోటు చేసుకుందని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ బానోత్ భిక్షపతి నాయక్ డిమాండ్ చేశారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

జనగామ రూరల్ : రఘునాథపల్లి మండలం మేకలగట్టు గ్రామంలో జీపీ కార్మికుడు వేల్పుల నాగరాజు ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఇందుకు కారకులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం సీహెచ్ మల్లాచారి అధ్యక్షతన నిర్వహించారు. యూనియన్ నాయకులు బాల నర్సయ, పగిడిపల్లి మల్లేష్ ,ఉమ్మగొని రాజేష్, బి సత్యనారాయణ, కొయ్యడ బిక్షపతి, ఎస్ రాజు తూడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే లో పాల్గొన్న విద్యార్థులు

జనగామ రూరల్ : పట్టణంలోని సెయింట్ పాల్స్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాన్సిలీయన్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ ఎస్.రవిప్రశాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మరియా జోసఫ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మనిషి ఎప్పుడు నిరంతరం విద్యార్థిగా ఉండాలన్నారు.అలాగే చిన్నారులు చదువుకునే సమయంలో ఉపాధ్యాయుల తో పాటు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. అనంతరం చిన్నారుల నృత్యాలు పలువురిని అకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేవాదుల సృష్టికర్తగా చెప్పకోవడం సిగ్గుచేటు

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్ : ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదుల సృష్టికర్త అని చెప్పుకోవడం సిగ్గుచేటని, వాస్తవానికి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో దేవాదుల ప్రాజెక్టు, స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ వచ్చాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడియంశ్రీహరిపై మండిపడ్డారు. కడియం శ్రీహరి రాజకీయ జీవితం అబద్ధాల పునాదులపై ఏర్పడిందని, నమ్మకద్రోహి, విశ్వాస ఘాతకుడని, బిడ్డ రాజకీయ జీవితం కోసం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని నట్టేట ముంచాడని ఆరోపించారు. అనంతరం మండలంలోని తానేదార్‌పల్లిలో గీత కార్మికుడు మాచర్ల ఎల్లయ్య తాటిచెట్టుపై నుంచి పడి శుక్రవారం సాయంత్రం మృతిచెందగా రాజయ్య సంతాపం తెలిపారు.

ప్రజా పాలనతో ప్రతి ఇంటా సంక్షేమం

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

కొడకండ్ల : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ప్రతి ఇంటా సంక్షేమం అందిస్తున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో రూ.4 లక్షల సీడీఎఫ్ నిధులతో ఆధునీకరించిన తహసీల్దార్ చాంబర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం 42 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ కొడకండ్లలో ఏర్పాటు చేసేందుకై ప్రతిపాదనలు పంపానని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోల చంద్రమోహన్, సీనియర్ అసిస్టెంట్ సుమన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, రాజేష్‌నాయక్, మార్కెట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

పాలకుర్తి టౌన్ : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

యువతకు ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నాం

పాలకుర్తి : యువత ఉపాధి పొందేందుకు అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెన్నూరు మహర్షి విద్యాలయంలో 30 ఏళ్ల నుంచి చదివిన విద్యార్థులంతా మైత్రి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మహాత్మా గాంధీ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ వ్యవస్థాపకుడు గంటా రవీందర్ పాల్గొని మాట్లాడారు. ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, ప్రిన్సిపాల్ వెంకటాచారి, కరస్పాండెంట్ నరేందర్ రెడ్డి, సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, హరీష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

జఫర్‌గఢ్ : గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుగు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి పంటను కోసి ధాన్యం అమ్ముకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు నక్క యాకయ్య, వేల్పుల పెద్ద రాములు, ఎండి శంషోద్దిన్, రవి, తాటికాయల బాబు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీతారాముల కల్యాణానికి ముస్తాబు

స్టేషన్‌ఘన్‌పూర్ : శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని తాటికొండ శ్రీ సీతారామచంద్రస్వామి, తిరుమలనాథస్వామి ఆలయాలు, శివునిపల్లి నగరేశ్వరాయలంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో కమిటీలు, భక్తుల ఆధ్వర్యంలో శనివారం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

ధ్వజారోహణం

లింగాలఘణపురం : మండలంలోని నవాబుపేట కోదండ రామస్వామి ఆలయంలో శనివారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడ ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. సంతానం లేని మహిళలు గరుడముద్ద ప్రసాదం తీసుకుంటే సంతానం కలుగుతుందని నమ్మకంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈఓ లక్ష్మిప్రసన్న, రాజేందర్‌రెడ్డి, రవితేజ, అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన హనుమాన్ నామస్మరణ

రఘునాథపల్లి : మండల కేంద్రంలో మహాదేవస్వామి, అంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎంపీపీ వై. కుమార్‌గౌడ్, చింతకింది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ పూజలు చేశారు. హనుమాన్ మాలధారులు జై హనుమాన్.. జై జై హనుమాన్ అంటూ హనుమాన్ నామస్మరణలతో ఆలయం హోరెత్తింది.

శివయ్యకు అన్నపూజ

జనగామ : పట్టణంలోని నగేశ్వర వాసవీ కన్యకా పరమేశ్వరి శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో శనివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అన్న పూజా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

జనగామ రూరల్ : పట్టణంలోని పాత బీటుబజార్ శ్రీ సీతారామచంద్ర స్వాముల శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

భూమి పూజ

నర్మెట : మహాత్మా జ్యోతిబా పూలే-సావిత్రిబాయి పూలే విగ్రహాల ప్రతిష్ఠకు విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు మండలకేంద్రంలో శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది రెడ్డబోయిన రాజు, సామాజిక సేవా కార్యకర్త ఎనుగుల వెలంగిణి, పల్లె ప్రభుదాస్, కొలిపాక సుధాకర్, గద్దం మల్లేషం, పొనగంటి సురేష్, గద్దం మహేందర్, చింతల కృష్ణ, ఐలేని శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోవాలి



బచ్చన్నపేట : విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోవాలని, అప్పుడే జీవితంలో స్థిరపడతారని ఎస్సై ఎస్‌కే హమీద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో శ్రీవాణి పాఠశాల 26వ వార్షికోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయుడు భాస్కరుని సుమలత అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవాలి

తల్లిదండ్రులు తమ పిల్లల చదువు సామర్థ్యాలను తెలుసుకోవాలని అప్పుడే వారిని ఎలా మార్చాలో తెలుస్తుందని మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయ కరస్పాండెంట్ కరికె ఊర్మిళ ప్రసాద్ బాబు అన్నారు. శనివారం పాఠశాలలో ఓపెన్ హౌస్, యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిమ్మ రాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



నర్మెట : పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి శనివారం ఉన్నతాధికారుల ఆదేశాలతో తిరిగి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు. బాధితులు పిన్నోజు ప్రశాంత్, చల్లం శంకర్‌లకు సెల్‌ఫోన్ల తిరిగి అప్పగించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పీసీ బి.భాస్కర్‌ను అభినందించారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి



రమేశ్ (ఫైల్)

కొడకండ్ల : కొడకండ్ల వ్యవసాయ మార్కెట్‌లో సూపర్‌వైజరుగా పనిచేస్తున్న గాడిపెల్లి రమేశ్ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. రమేశ్ మృతిపట్ల మార్కెట్ చైర్మన్ నల్ల అండాలుతో పాటు డైరెక్టర్లు, సిబ్బంది సంతాపాన్ని వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..



శ్రీనివాస్ మృతదేహం

నర్మెట : గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇరుగు శ్రీనివాస్ (45) మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయమని మందలించిన భార్య మణెమ్మతో గొడవ పడేవాడు. ఈక్రమంలో ఫిబ్రవరి 21న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సరికాదు



పాలకుర్తి టౌన్ : ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిపై బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేగ రామ్మోహన్‌రెడ్డి వ్యక్తిగత ప్రయోజనాల కోసం తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కొడకండ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశగాని నాగరాజు, బానోత్ యాకూబ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రామ్మోహన్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే డిపాజిట్ కూడా దక్కలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో కొందరు నాయకులు పార్టీ వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదన్నారు. నాయకులు భూక్యా వీర్య, యాకూబ్, ధరావత్ రవి, మొగిలి పాల్గొన్నారు.

'ఎంఐఎంకు మేలు చేసేలా బీసీ రిజర్వేషన్'

చిల్పూరు : ఎంఐఎంకు మేలు చేసేలా బీసీల పేరిట 42 శాతం రిజర్వేషన్ వద్దని ప్రత్యేకంగా బీసీలకే ప్రకటించాలని బీజేపీ అనుబంధ సంస్థ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పల్లగుట్ట గ్రామంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తోకల సంపత్‌రెడ్డి, కందుకూరి రజనీకర్, దోరం శ్రీను, నామాల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్డీఓ కార్యాలయంలో వెంకన్న



రఘునాథపల్లి: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద..



జనగామ రూరల్: బీజేపీ కార్యాలయంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాజయ్య



జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



జనగామ: మాట్లాడుతున్న రామిని హరీష్



లింగాలఘణపురం: కళ్లెంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని పలువురు నాయకులు కొనియాడారు. శనివారం జిల్లా వ్యాప్తంగా జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



నర్మెటలో..



బచ్చన్నపేటలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసిన నాయకులు